పంటల బీమా ఊసేది..?

- ప్రీమియం చెల్లింపు నిలిపివేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- భారీ వర్షాలతో ధ్వంసమైన పంటలు
- నష్టపోతున్న అన్నదాతలు


ఏట్ల ఎర్రవల్లిలో ఈసీ వాగు సమీపంలో నీట మునిగిన పత్తి పంటలు

షాబాద్: భారీవర్షాలు, ఈదురుగాలులు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటలకు నష్టం వాటిల్లితే రైతులకు పరిహారం అందించేందుకు కేంద్రం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంత ప్రీమియం, మిగతాది రైతులు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో నష్టపోయినప్పుడు బాధిత రైతులు పరిహారం పొందేవారు. పీఎంఎఫ్‌బీవై కింద పంటల సాగు ప్రారంభంలో బీమా చేస్తే నష్టం వాటిల్లినపుడు అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి అంచనాలు వేసి బాధితులకు పరిహారం అందేలా చేసేవారు. గత కొన్నేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రీమియం చెల్లించకపోవడంతో పథకం లక్ష్యం నీరుగారుతోంది.

మండలంలో ఇలా..

మండలంలో వానాకాలం సీజన్‌కు సంబంధించి వందల ఎకరాల్లో పత్తి, వరి పంట సాగు చేశారు. ప్రభుత్వం నియంత్రిత పంటల సాగు విధానం అమలులోకి తీసుకురావడంతో పత్తి పంట, వేరుశనగ పంటలకు ప్రాధాన్యత ఇచ్చారు. గత సంవత్సరం మండలంలో పత్తితో పాటు వేరుశనగ పంటను ప్రధాన పంటగా సాగు చేశారు. గతంలో గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని బీమా పథకాన్ని వర్తింపజేశారు. ఎకరాకు రూ.500ల చొప్పున ప్రీమియం తమ ఆధార్, పట్టా పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా నంబర్లతో ఏఈఓ లేదా రెవెన్యూ అధికారి ధ్రువీకరణతో మీ సేవకేంద్రంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

50 శాతం మేర నష్టం..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి, వరి వంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలో వందల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో బీమా పథకం ఉంటే రైతులు నష్టపోకుండా ఉండేవారు. ప్రకృతి వైపరీత్యాలతో పాటు విత్తనాలు మొలకెత్తకపోవడం, నారు పెరగకపోవడంతో కలిగే నష్టాలకు బీమాలో 25 శాతం వరకు సత్వరం చెల్లించే అవకాశం ఉండేది. తుఫాన్, అకాల వర్షాల కారణంగా నష్టం జరిగితే అంచనా వేసి షరతులతో కూడిన చెల్లింపులు చేస్తారు. కానీ ఈ సారి ఫసల్ బీమా ప్రస్తావనే లేకపోవడం రైతులకు కలవరపెడుతోంది. ప్రారంభంలో ఫసల్ బీమా పథకంలో చేరే రైతుల ప్రీమియంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఏటా 90 శాతం వరకు చెల్లించేవి. కానీ ప్రభుత్వాలు ప్రీమియం చెల్లింపులో నిర్లక్ష్యం ప్రదర్శించడంతో పథకానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

పథకాన్ని అమలు చేయాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎంఎఫ్‌బీవై పథకాన్ని నిలిపివేయడంతో భారీ వర్షాల కారణంగా పంట నష్టం వాటిల్లినా ప్రభుత్వాల నుంచి సహాయం అందడం లేదు. ఈ పథకాన్ని మళ్లీ ప్రారంభించి రైతులకు నష్టం లేకుండా చూడాలి.

–ముద్దెంగూడ శేఖర్, రైతు, తిమ్మారెడ్డిగూడ

ఆదేశాలు రాలేదు

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకం విషయంలో అధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేదు. గతంలో ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోతే బాధిత రైతులకు పరిహారం అందేది. రెండేళ్ల నుంచి బీమా నిలిపియడం జరిగింది. కేంద్రం 25 శాతం, రాష్ట్రం 25 శాతం, రైతు 50 శాతం ప్రీమియం చెల్లించేవారు. కానీ పథకం నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పుకోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

–కృష్ణమోహన్, ఏఓ

పట్టణాల అభివృద్ధికి పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పల్లెలు, పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధికి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి దానికి అనుగుణంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఫరూఖ్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.40లక్షలతో మరమ్మతులు చేపడుతున్నామన్నారు. పట్టణంలో రోడ్ల అభివృద్ధికి రూ.2.49 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. అదే విధంగా పట్టణంలో 7, 9, 10 వార్డుల్లో ఉన్న నాలుగు పార్కుల మరమ్మతులకు ప్రభుత్వం రూ.2కోట్ల 20లక్షలు మంజూరు చేసిందన్నారు. నందిగామ మండలం మేకగూడ నుంచి జేపీ దర్గా రోడ్డు మరమ్మతులకు రూ.50లక్షలు, ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి పీడబ్ల్యూ రోడ్డు నుంచి నాగర్లగడ్డతండా వరకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ.4కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కొత్తూరు మండలం జేపీ దర్గా నుంచి ఇన్ముల‌నర్వ తండాకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ.2.70కోట్లు మంజూరైనట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సాదా బైనామానాలకు మోక్షం కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, కొంకళ్ల చెన్నయ్య, కృష్ణారెడ్డి, బాల్‌రాజ్, రఘునాయక్, శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, ముబారక్, దామోదర్‌రెడ్డి, అన్వర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం


చేవెళ్ల: ఉత్తమ ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే కాలె యాదయ్య, స్థానిక నాయకులు


మొయినాబాద్‌రూరల్: సన్మానం పొందిన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే కాలె యాదయ్య

- ఎమ్మెల్యే కాలె యాదయ్య
- మండల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

చేవెళ్ల: నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలో గురువారం మండల విద్యాధికారి ఎల్‌పురన్‌దాస్ ఆధ్వర్యంలో మండల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మండల స్థాయిలో ఎంపికైన 21 మంది ఉపాధ్యాయులు, జిల్లాకు ఎంపికైన 10 మందిని, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన ఉపాధ్యాయుడు కె. బాలాజీని సన్మానించి, అవార్డులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యరంగానికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ నాయకుడు జనార్దన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు గోనే ప్రతాప్‌రెడ్డి, దేవర వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఎం.కృష్ణారెడ్డి, ఆగిరెడ్డి, శైలజ, సమత, గోపాల్‌రెడ్డి, మధుసూదన్‌గుప్తా, వీరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఆశీర్వాదం మండలంలోని గెజిటెడ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

మొయినాబాద్‌రూరల్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం మండలంలోని పాఠశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి మండల పరిషత్ కార్యాలయంలో మండల విద్యాధికారి మల్లయ్య అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మండల స్థాయిలో ఏడు మంది ఉపాధ్యాయులు, జిల్లా స్థాయిలో ఎంపికైన 9 మంది ఉపాధ్యాయులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు పోచయ్య, ఎస్టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విఠల్, టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, కాంగ్రెస్ పార్టీ ఫిషర్‌మెన్ జిల్లా చైర్మన్ మహేందర్‌ముదిరాజ్, చేవెళ్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎలిగెపల్లి శ్రీనివాస్‌యాదవ్, గడ్డం వెంకట్‌రెడ్డి, పట్నం రాంరెడ్డి, అశోక్, అరుణ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కాలె యాదయ్య


పామెనలో లింక్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

చేవెళ్ల: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం ఎమ్మెల్యే కాలె యాదయ్య స్థానిక నాయులతో కలిసి మండలంలోని సింగప్పగూడలో రూ.30 లక్షలతో సీసీరోడ్డు, రూ.5 లక్షల నిధులతో వీధిలైట్లు, ఎనికేపల్లిలో రూ.20 లక్షలతో సీసీరోడ్డు, రూ.10 లక్షలతో వీధిలైట్లు, ఈర్లపల్లిలో రూ.40 లక్షలతో సీసీరోడ్డు, రూ.5 లక్షలతో వీధిలైట్లు, మున్సిపల్ పరిధిలోని మల్కాపూర్‌లో రూ.30 లక్షలతో సీసీరోడ్డు, పామెన వార్డులో రూ.30 లక్షలతో సీసీరోడ్డు, రూ.30 లక్షలతో పార్మిషన్ రోడ్డు, చేవెళ్లలోని పలు వార్డుల్లో కోటి రూపాయలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించటంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నారన్నారు. మండలం, మున్సిపాలిటీకి సంబంధించి మొత్తం 118 అభివృద్ధి పనులకు గాను రూ.9 కోట్ల 90 లక్షల హెచ్‌ఎండీఏ నిధులు విడుదలైనట్లు వెల్లడించారు. త్వరలో మరిన్ని నిధులు మంజూరు చేయించి అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు పాటుపడుతానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు డీవీఆర్, గోనే ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, మార్కెట్ చైర్మన్ పెంటయ్యగౌడ్, సీనియర్ జిల్లా, నియోజకవర్గ నాయకులు జనార్దన్‌రెడ్డి, వసంతం, ఆగిరెడ్డి, ఎంకేఆర్, శైలజ, సమత, గోపాల్‌రెడ్డి, ఎండీ అలీ, రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు మధుసూదన్‌గుప్తా, మున్సిపల్ కమిషనర్ వెంకటేశం, పీఆర్‌డీఈ గణేశ్, ఏఈ ప్రభాకర్, మండల నాయకులు తదితరులు ఉన్నారు.

దేవాలయ అభివృద్ధికి విరాళం


ఎమ్మెల్యే చేతుల మీదుగా విరాళాన్ని అందజేస్తున్న దాతలు

షాద్‌నగర్‌రూరల్: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామ శివారులో గల శ్రీ అంబాభవానీమాత దేవాలయ అభివృద్ధికి మండల పీఏసీఎస్ చైర్మన్ బక్కన్నయాదవ్, కొందుర్గు పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, కేశంపేట పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్, చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్ రూ.2లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని గురువారం ఎమ్మెల్యే చేతుల మీదుగా దేవాలయ చైర్మన్ ముత్యాలరాజుకు వారు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పురాతన దేవాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. దేవాలయాలలో భక్తులకు కావాల్సిన వసతులను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, అందులో భాగంగానే ప్రభుత్వం రూ.50 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. దేవాలయం అభివృద్ధికి దాతలు ముందుకొచ్చి విరాళాలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శివకుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కావలి శ్రీశైలం, మాజీ వార్డు సభ్యుడు నారం శ్రీపాదరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నారం పెంటారెడ్డి, ఆర్ల యాదయ్యయాదవ్ పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

వికారాబాద్ ఎస్‌ఏపీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దేవకీదేవి


కళాశాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ దేవకీదేవి, కాంచనలత, అధ్యాపకులు

చేవెళ్ల: ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్ పొందాలని వికారాబాద్ ఎస్‌ఏపీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవకీదేవి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను నిర్ధారించుకొని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. పట్టుదలతో శ్రమిస్తే విజయం ధరిచేరుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనపాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరిచయాలు చేసుకుంటూ వారి అనుభవాలను కొత్త విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రమేశ్‌బాబు, డాక్టర్ మాలిక్, ఎ.కవిత, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను పరిష్కరించుకోవాలి

రిటైర్డు జడ్జి సాంబశివరావు

చేవెళ్ల: ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో నమోదైన పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించుకునేందుకు కొనసాగుతున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డు జడ్జి సాంబశివరావు కోరారు. పట్టణ కోర్టు ఆవరణలో గురువారం నాలుగో రోజు లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల సర్కిల్ పరిధిలో నమోదైన పోలీస్ కేసులు పరిష్కరించుకునేందుకు ఈ నెల 13వ తేదీ వరకు లోక్ అదాలత్ కొనసాగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపించిన కేసులలో గురువారం 40 కేసులను పరిష్కరించి 67 వేల రూపాయల జరిమానాలు విధించినట్లు వెల్లడించారు. ఇంకా ఎవరైనా పెండింగ్ కేసులు ఉంటే వెంటనే వాటిని పరిష్కరించుకునేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, ఏఎస్‌ఐ చందర్‌నాయక్, సిబ్బంది కవిత, జంగయ్య ఉన్నారు.

మహిళల రక్షణే లక్ష్యం

షీటీం సభ్యుడు సురేశ్‌కుమార్‌గౌడ్

షాద్‌నగర్‌రూరల్: ఆపద సమయంలో మహిళలను రక్షించడమే షీ టీం లక్ష్యమని సభ్యుడు సురేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ భవానీశంకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోక్సోచట్టం, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, విద్యార్థినులు చదువుపై దృష్టి పెట్టి ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సెల్‌ఫోన్, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా యాప్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. బస్టాండ్, రైల్వేస్టేషన్ వంటి రద్దీ ప్రాంతాలలో అపరిచిత వ్యక్తులపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే షీటీంతో పాటు 100, 181, చైల్డ్ హెల్ప్‌లైన్‌కు 1098, సైబర్ క్రైం కోసం 1930కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. బాలికలు, మహిళలు వేధింపులకు గురిచేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థినులు చిన్నచిన్న విషయాలకు ఆందోళన చెందకుండా ఆలోచనతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు శ్రీకాంత్‌గౌడ్, వెంకటేశ్, అధ్యాపకులు కరుణాకర్, రాఘవేందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్


రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు

షాద్‌నగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.2 కోట్ల 19 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ప్రభుత్వం నుంచి ప్రత్యేకమైన నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణం త్వరితగతిన అభివృద్ధి చెందుతుందన్నారు. కాంట్రాక్టరు నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని, సకాలంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, నాయకులు రఘు, బస్వం, కృష్ణారెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, పాషా, బాల గంగాధర్‌తిలక్ తదితరులు పాల్గొన్నారు.

తీరని సమస్య.. తప్పని తిప్పలు

- చెరువు నిండి రోడ్డుపై పారుతున్న వరదనీరు
- పదిహేను రోజులుగా వాహనదారులు, స్థానికులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు


చిలుకూరు పెద్దచెరువు అలుగు వద్ద రోడ్డుపై నుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో ఇబ్బందులు పడుతూ వెళ్తున్న వాహనదారులు

మొయినాబాద్: చిలుకూరు పెద్ద చెరువు పూర్తిస్థాయిలో నిండి రోడ్డుపై నుంచి నీరు వెళ్లడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గత పదిహేను రోజులుగా తిప్పలు తప్పడం లేదు. జిల్లా అదనపు కలెక్టర్ పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించినా అధికారులు స్పందించడం లేకపోవడం గమనార్హం.

రోడ్డుపై వరదనీరు.. రాకపోకలకు ఇబ్బందులు

మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చెరువు గత ఇరవై రోజుల క్రితమే పూర్తిస్థాయిలో నిండింది. అలుగు కింది భాగంలో దాని కంటే ఎత్తులో రోడ్డు వేయడంతో ఎఫ్‌టీఎల్ స్థాయి కంటే ఎక్కువ నీరు నిలిచి బ్యాక్ వాటర్‌తో పంటలు మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కురుస్తున్న వర్షాలకు చెరువులోకి నీరు చేరుతుండడంతో అలుగు వద్ద ఉన్న రోడ్డుపై నుంచి నీళ్లు ప్రవహిస్తున్నాయి. పదిహేను రోజుల క్రితమే అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ప్రమాదస్థాయిలో నిండిన చిలుకూరు పెద్ద చెరువును సందర్శించారు. ఎఫ్‌టీఎల్ స్థాయి కంటే ఎక్కువ ఉన్న నీటికి కిందికి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కానీ అధికారులెవరూ పట్టించుకోలేదు. బ్యాక్ వాటర్‌తో పంటలు మునిగి తీవ్రంగా నష్టపోతున్నామని మూడురోజుల క్రితం రైతులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో.. గురువారం ఇరిగేషన్ అధికారులు వచ్చి అలుగుపై పేరుకుపోయిన మట్టిని జేసీబీతో తొలగించారు. దీంతో రోడ్డుపైకి మరింత ఎక్కువ నీరు చేరింది. అలుగు కింది భాగంలో కొంతమేర మట్టిని తొలగిస్తే రోడ్డుపై ఎక్కువ నీరు నిల్వకుండా కిందకు వెళ్లే అవకాశం ఉంది. కానీ మున్సిపల్ అధికారులు రోడ్డు కింది భాగంలో మట్టి తొలగించకుండా వదిలేశారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. చిలుకూరు, అప్పోజీగూడ, చందానగర్, రెడ్డిపల్లి, చిన్నమంగళారం, కుత్బుద్దీన్‌గూడ, వీరన్నపేట, మేడిపల్లి గ్రామాలతో పాటు ప్రగతి రిసార్ట్స్, ఎనికేపల్లి, తంగడపల్లి తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ఇదే రోడ్డుపై వెళ్తున్నాయి. ఆయా ప్రాంతాల వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత పదిహేను రోజులుగా వాహనదారులు ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని.. రోడ్డుపై చేరుతున్న వరదనీటితో తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ తీరు నియంతలా ఉందని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చిలుకూరు పెద్ద చెరువు అలుగునీరు సులువుగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

రోడ్డుపై గుంత పూడ్చివేత


రోడ్డుపై గుంతను పూడ్చిన యువకులు

సాక్షి ఎఫెక్ట్..

మొయినాబాద్‌రూరల్: రోడ్డుపై మూలమలుపు వద్ద ఏర్పడిన భారీ గుంతను యువకులు పూడ్చివేసి వాహనదారుల ఇబ్బందులు తీర్చారు. మండల పరిధిలోని అమ్డాపూర్–నదీమ్‌నగర్ గ్రామాల మధ్య రోడ్డులో మూలమలుపు వద్ద ప్రమాదకరంగా గుంత ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని, రోడ్డుపై గుంత.. ప్రయాణాలకు చింత అనే శీర్షకతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి అమ్డాపూర్ గ్రామ యువకులు స్పందించారు. గుంతను సిమెంట్, కంకర వేసి పూడ్చారు. దీంతో వాహనాదారులు యువకులను అభినందిస్తున్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీఓ లక్ష్మణ్‌నాయక్

షాబాద్: కేంద్ర ప్రభుత్వం నిర్వహించే కళా ఉత్సవ్ పోటీల్లో షాబాద్ నవజీవన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మేఘన, మెహక్, దివ్యశ్రీ, ఎస్తేర్ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండెంట్ పాపిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

భారీ వర్షం.. ఇబ్బందిపడిన జనం


వర్షంలో తడుస్తూ బైక్‌పై వెళ్తున్న ప్రజలు

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలో గురువారం మధ్యాహ్నం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొయినాబాద్, పెద్దమంగళారం, చిలుకూరు, హిమాయత్‌నగర్, ఎనికేపల్లి, ముర్తూజగూడ, సురంగల్, అప్పోజీగూడ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. ఆయా ప్రాంతాల్లోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. సాయంత్రం విద్యార్థులు, ఉద్యోగులు ఇళ్లకు చేరే సమయంలో ఇబ్బంది పడ్డారు. పంట పొలాల్లో నీళ్లు నిలిచాయి.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శేఖర్‌రెడ్డి


విద్యార్థులకు వాటర్ బాటిల్స్, ప్లేట్స్ అందజేస్తున్న సంస్థ ప్రతినిధి మురహరిగౌడ్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని మొగిలిగిద్ద స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రంగంపల్లి ప్రాథమిక పాఠశాలకు గ్రేటర్ అట్లాంటా సొసైటీ సహకారంతో సౌండ్ సిస్టమ్, విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్, ప్లేట్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శేఖర్‌రెడ్డి హాజరై విద్యార్థులకు ప్లేట్స్ పంపిణీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివకుమార్, సంస్థ ప్రతినిధి మురహరిగౌడ్, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ శివరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

కడ్తాల్: ఊరు నిండా కన్నే.. ఊరంతా సీసీ కెమెరాలే కార్యక్రమంలో భాగంగా.. చరికొండలో కెమెరాల ఏర్పాటుకు అదే గ్రామానికి చెందిన మహేందర్‌గౌడ్ రూ.21 వేల విరాళం చెక్కును గురువారం సీఐ గంగాధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాతను సీఐ, ఎస్‌ఐ, సిబ్బంది సన్మానించారు. నేర నియంత్రణకు దోహదపడే సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వరప్రసాద్, చంద్రశేఖర్, ఏఎస్‌ఐ బాల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, శివదత్త ఉన్నారు.